కన్నుల పండువగా గోదాదేవి కల్యాణం

● పోటెత్తిన భక్తులు





బొల్లవరం ప్రసన్న వెంకటేశ్వరస్వామి కల్యాణం నిర్వహిస్తున్న వేదపండితులు... తిలకిస్తున్న భక్తులు

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని వైష్ణవాలయాల్లో గోదాదేవి, రంగనాయకుల కల్యాణం కన్నుల పండువగా నిర్వహించారు. స్వామి వారి కల్యాణం తిలకించడానికి తరలివచ్చిన భక్తులతో ఆలయాలు కిటకిటలాడాయి. సోమవారం ఉదయం పాత మార్కెట్‌లో లలితాదేవి, రతనాల వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామి, అమ్మవార్లకు విశేషపూజలు చేశారు. గోదాదేవి, రంగనాయకుల ఉత్సవ మూర్తులను శోభాయమానంగా అలంకరించి వేదికపై ఆశీనులను చేశారు. సుముహూర్తంలో వేద పండితులు స్వామివారి కల్యాణంను వేద మంత్రోచ్చారణలతో కన్నుల పండువగా నిర్వహించారు. బొల్లవరంలోని ప్రసన్న వెంకటేశ్వరస్వామి ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుని కల్యాణాన్ని వైభవంగా నిర్వహించారు. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత ప్రసన్న వెంకటేశ్వరునికి ప్రత్యేక పూజలు నిర్వహించి సుందరంగా అలంకరించారు. పూజలు అనంతరం శ్రీకృష్ణుడు, గోదాదేవిని అలంకరించి వేదికపై ఆశీనులు చేశారు. వేద పండితులు సుముహూర్తంలో వేద మంత్రాలు, మంగళవాయిద్యాలు, ముత్యాల తలంబ్రాలతో స్వామివారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. హౌసింగ్‌బోర్డు కాలనీలోని లక్ష్మీ సమేత వెంకటేశ్వరస్వామి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. గోదాదేవి, రంగనాయకుల కల్యాణాన్ని ఘనంగా నిర్వహించారు. శ్రీకృష్ణ ఆలయంలో గోదాదేవి, శ్రీకృష్ణుల కల్యాణం నిర్వహించారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.

ఆనందపు కాంతుల.. భోగి

● వాడవాడలా భోగి మంటలు ● నేడు మకర సంక్రాంతి





విజయదుర్గమ్మ కాలనీలో భోగిమంటలు వేస్తున్న దృశ్యం



డ్యాన్సులు వేస్తూ..



డోలు వాయిస్తూ..

కడప కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగువారి తొలి పండుగ సంక్రాంతి. ఇందులో భాగంగా మొదటిరోజు భోగి పండుగను జిల్లా ప్రజలు ఆనందోత్సాహాల మధ్య జరుపుకున్నారు. తెల్లవారుజామున 3 గంటల నుంచి భోగి మంటలు వేసి సంక్రాంతికి స్వాగతం పలికారు. చిన్న, పెద్ద తేడా లేకుండా.. చలిని సైతం లెక్కచేయకుండా భోగిమంటలు వేశారు. ఇళ్లల్లోని పనికిరాని పాత వస్తువులను అందులో వేసి తగలబెట్టారు. అనంతరం నూతన దుస్తులు ధరించి శుభాకాంక్షలు తెలుపుకున్నారు. ముఖ్యంగా పల్లె ప్రాంతాల్లో ప్రత్యేక సందడి కనపడింది. ఆ కోవలో నగరంలోని విజయదుర్గా కాలనీ, తదితర చోట్ల తెల్లవారక ముందే వీధి వీధిలో భోగి మంటలు వేశారు. పట్టణ ప్రాంతాల్లో వున్న వారు సైతం స్వంత ఊర్లకు చేరుకుని ఆప్యాయంగా చిన్ననాటి మిత్రులతో కలిసి ఉత్సాహంగా పాల్గొని మధుర జ్ఞాపకాలను నెమరేసుకున్నారు.

విజయదుర్గా కాలనీలో సందడి

నగరంలోని విజయదుర్గా కాలనీలో ఓ కుటుంబ సభ్యులు చేసిన సందడి ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ప్రతి ఏటా చెన్నై, హైదరాబాద్, బెంగుళూరు నుంచి సంక్రాంతికి ఇక్కడికి వస్తుంటారు. వీరందరూ వివిధ విభాగాల్లో ఉద్యోగాలు చేస్తూ అక్కడే స్థిరపడ్డారు. పండుగకు కుటుంబ సమేతంగా ఇక్కడికి వచ్చి తెల్లవారుజాము నుంచి భోగిమంటలు.. డ్యాన్సులు వేస్తూ గడుపుతారు. ఇక పాత మున్సిపల్ కార్యాలయం వద్ద మున్సిపల్ కార్మికులు భోగి సంబరాలు చేసుకున్నారు.



పాతమున్సిపల్ కార్యాలయం వద్ద భోగిమంటల్లో పాల్గొన్న కార్పొరేషన్ అధికారులు


తగ్గేదేలే..

● కత్తి కట్టిన కోడి
● షామియానాలు కట్టి.. బరులు గీసి.. యథేచ్ఛగా పందేలు
● పులివెందులలో విచ్చలవిడిగా సాగిన పందెం
● రూ.రెండుకోట్ల మేర చేతులు మారిన వైనం
● పందేల వైపు కన్నెత్తి చూడని పోలీసులు
● ముందే చెప్పిన ఆంధ్రజ్యోతి



పులివెందుల మండలం కొత్తపల్లెలో తలపడుతున్న కోళ్లు

అవును ఆంధ్రజ్యోతి చెప్పిందే అక్షరసత్యమైంది. సంక్రాంతి పండుగ సందర్భంగా జూదగాళ్లు కోడిపందేల నిర్వహణకు వేసిన ప్రణాళిక సక్సెస్ అయింది. కృష్ణా, ఈస్ట్, వెస్ట్ జిల్లాల్లో జరిగే కోడిపందేలను కడప జిల్లాలోనూ నిర్వహిస్తున్నట్లు ఆంధ్రజ్యోతిలో సోమవారం కథనం ప్రచురితమైంది. జిల్లాలో భోగి రోజున భోగిమంటలు ఏమాత్రం వేశారో గాని కోడిపందేలు మాత్రం యథేచ్ఛగా జరిగాయి. కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని పోలీసులు హెచ్చరించినా ప్రయోజనం లేదు. పోలీసుల మాటలను నిర్వాహకులు పట్టించుకోకపోవడం గమనార్హం. జిల్లాలో ముఖ్యంగా పులివెందుల ప్రాంతంలో పెద్దఎత్తున ఈ పందేలు సాగాయి.



లింగాల మండలం దొండ్లవాగులో ...

కడప, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జిల్లా వ్యాప్తంగా కోడిపందేలు భారీస్థాయిలో జరిగాయి. మాకెవరు అడ్డు అనే రీతిలో ఈ పందేలు నిర్వహించారు. పోలీసు యంత్రాంగం లేదా అనే స్థాయిలో ఈ పందేలు సాగినట్లు తెలుస్తోంది. సంక్రాంతి సంబరాల్లో కోడిపందేలు ఈ ఏడాది హైలెట్‌గా నిలుస్తున్నాయి. మూడు రోజుల పాటు ఈపందేలు సాగేందుకు సన్నాహాలు చేశారంటే పోలీసుల తీరు ఇట్టే అర్థమవుతుంది. జిల్లాలోని పులివెందుల, జమ్మలమడుగు నియోజకవర్గాల్లో కోడిపందేలు సాగాయి. జమ్మలమడుగు నియోజకవర్గంలోని ముద్దనూరు మండలం ఉప్పలూరులో కోడిపందేలు సాగాయి. ఇక పులివెందుల నియోజకవర్గంలో ఏకంగా ఎనిమిది చోట్ల కోడిపందేలు నిర్వహించారంటే అక్కడ ఏస్థాయిలో జూదానికి ప్రాధాన్యత ఉందో ఇట్టే అర్థమవుతుంది. సంక్రాంతి అంటే మూడు రోజుల పండుగ అని అది కూడా కేవలం కోస్తా ప్రాంతంలో మాత్రమే పూర్తిస్థాయిలో పండుగ సాగేది. సంక్రాంతి నాటికి కోస్తా రైతులకు పంటలు పండి ధాన్యం ఇంటికి చేరి ఉంటుంది. పంట పండి రైతు మోములో చిరునవ్వు ఉండడంతో ఈ పండగ మూడు రోజుల పాటు ఎంతో ఆనందంగా జరుపుకొంటారు. భోగిరోజు కోడిపందేలు నిర్వహించడం అక్కడ అలవాటుగా మారింది. కానీ మన జిల్లా విషయానికొస్తే సంక్రాంతి పండుగ చెప్పుకొనే స్థాయిలో జరుపుకోరు. ఎందుకంటే ఈ ప్రాంతంలో ధాన్యం సంక్రాంతి నాటికి ఇంటికి చేరదు. ఇక్కడంతా మెట్ట ప్రాంతం వర్షాధార పంటలే పండుతాయి. శివరాత్రి నాటికి గాని పంటలు రైతులకు చేతికందవు. పంటలు చేతికందినా రైతుల మోములో చిరునవ్వులు చిందించే స్థాయిలో పంటల దిగుబడులు ఇక్కడ రావు. కానీ కోడిపందేలు మాత్రం కోస్తాలో ఒక రోజు సాగితే మన జిల్లాలో మాత్రం మూడు రోజులు సాగించేందుకు నిర్వాహకులు కాళ్లు దువ్వుతున్నారు. భోగిరోజు పులివెందుల నియోజకవర్గంలో ఏకంగా ఎనిమిది చోట్ల ఈ కోడి పందేలు సాగించారు. పులివెందుల నియోజకవర్గం ముద్దనూరులో జరిగిన కోడిపందేలు దాదాపు రూ.2కోట్ల మేర చేతులు మారాయంటూ సమాచారం. పులివెందుల సమీపంలో ఉన్న లింగాల మండలంలోని దొండ్లవాగు సమీపంలో సాగిన కోడిపందేలు జిల్లాలో హైలెట్‌గా నిలుస్తున్నాయి. దాదాపు రూ.50 లక్షల మేర పందేలు జరిగినట్లు తెలిసింది. పులివెందుల నియోజకవర్గంలో తొండూరు, సింహాద్రిపురం మినహా మిగిలిన ఐదు మండలాల్లో కోడిపందేలు సాగాయి. పులివెందుల మండలంలో ఇ.కొత్తపల్లె, వెంకటాపురం, ఎర్రిపల్లె అలాగే వేముల మండలంలోని వేములలో, వేంపల్లె మండలంలో అలవలపాడు, వెలమవారిపల్లె, చక్రాయపేట మండలంలో దేవరగట్టుపల్లెలో కోడిపందేలు నిర్వహించారు.

కోడిపందేలు నిర్వహించాల్సిందే

కొందరు నాయకులు పులివెందుల ప్రాంతంలో కోడిపందేలు నిర్వహించాల్సిందేనని పట్టుబట్టి మూడు రోజుల పాటు ఈ పందేలు సాగించేందుకు ముందస్తుగా పక్కా ప్లాన్ ప్రకారం కోడిపందేలు సాగించారు. సోమవారం ఆ నియోజకవర్గంలోని ఎనిమిది గ్రామాల్లో కోడి పందేలు సాగించారు. మంగళవారం సంక్రాంతి పండుగరోజున సోమవారం భోగి నిర్వహించిన కోడిపందేలు గ్రామాలతో పాటు మరికొన్ని గ్రామాల్లో నిర్వహించేందుకు నిర్వాహకులు సిద్ధమయ్యారు. ఒక పద్ధతి ప్రకారం ఈ గ్రామంలో ఒకరోజు, మరో గ్రామంలో మరోరోజు లెక్కలు వేసుకొని పందేలకు సై అంటున్నట్లు తెలిసింది. విచిత్రమేమిటంటే ఆ నియోజకవర్గంలోని కొందరు నాయకులే ఈ కోడిపందేల నిర్వహణకు ముందున్నట్లు తెలిసింది. కనుమరోజు సైతం కోడిపందేలు నిర్వహించాలని అక్కడి నిర్వాహకులు భావిస్తున్నట్లు తెలిసింది. అంటే సంక్రాంతి పండుగ మూడు రోజుల పాటు ఈ పందేలు మాత్రం యథావిధిగా సాగించాలని నిర్వాహకులు పట్టుబడుతున్నారు. గతంలో ఒక్కరోజు మాత్రమే కోడిపందేలు సాగగా ఈ సారి మూడు రోజులు నిర్వహించాలని భావిస్తున్నారు. మొదటిరోజే దాదాపు రూ.1.50 కోట్లకు పైగా పందేలు సాగినట్లు తెలిసింది. ఇక మిగిలిన రెండు రోజులు ఏ స్థాయిలో పందేలు సాగుతాయో అంచనా వేయొచ్చు. అంటే మొదటి రోజు కోడిపందేలు సాగుతాయో లేదోనని పూర్తి సమాచారం తెలియనివారు పందేలకు వచ్చి ఉండకపోవచ్చని, ఇక సంక్రాంతి, కనుమ రోజు ఏ స్థాయిలో ఈ పందేలు ఉంటాయో ఊహించవచ్చు.

పోలీసు యంత్రాంగం లేనట్లేనా ?

పులివెందుల నియోజకవర్గంలో కోడి పందేలు సాగిన తీరు చూస్తే అక్కడ పోలీసులు లేరా అనే ప్రశ్న ఉత్పన్నమవుతోంది. సాక్షాత్తు పులివెందుల డీఎస్పీ మురళినాయక్ కోడిపందేలు నిర్వహిస్తే కఠిన చర్యలు అని హెచ్చరించారు. ప్రత్యేక బృందంతో ఎక్కడ కోడి పందేలు నిర్వహిస్తే అక్కడకు వెళ్లి నిర్వాహకులపై కఠిన చర్యలు తీసుకుంటామ ని ప్రకటించారు. కానీ ప్రత్యేక బృందం అయితే ఏర్పాటు చేసిన ఆ బృందం డీఎస్పీ కార్యాలయానికే పరిమితమైనట్లు విమర్శలున్నాయి. పులివెందుల డీఎస్పీ పరిధిలో 9 పోలీస్ స్టేషన్లు ఉన్నాయి. స్టేషన్‌కు ఒక్కో కానిస్టేబుల్ చొప్పున 9 మందిని పులివెందుల డీఎస్పీ కార్యాలయానికి పిలిపించారు. వీరందరితో కూడిన ప్రత్యేక టీం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు ఈ టీంకు సంబంధించిన పోలీసులు కార్యాలయానికి చేరుకున్నారు. అప్పటి నుంచి సాయంత్రం 5గంటల వరకు కార్యాలయంలో నే బాతాకానీలు కొట్టడం మినహా ఆ బృందం చేసిందేమీ లేదని సమాచారం. ఏదేమైనా పులివెందుల ప్రాంతంలో జూదం ఏస్థాయిలో సాగుతుందో ఈ కోడిపందేలే నిదర్శనంగా మారాయి.



వేములలో జరుగుతున్న కోడిపందేలు



పులివెందులలో జరిగిన కోడిపందేలలో ఎగబడిన జనం

ఇసుక కొరత లేదు

● అందుబాటులో పదిలక్షల టన్నులు

● భూగర్భ గనులశాఖ డిప్యూటీ డైరెక్టరు సీహెచ్ సూర్యచంద్రరావు



(కడప-ఆంధ్రజ్యోతి): జిల్లాలో భవన నిర్మాణాలు, ఇతర నిర్మాణ రంగాల వారికి ఇసుక కొరత లేదు. జిల్లా అవసరాలకు సంబంధించి ఇసుక అందుబాటులో ఉన్నట్లు భూగర్భగనులశాఖ డిప్యూటీ డైరెక్టరు సీహెచ్ సూర్యచంద్రరావు ఆంధ్రజ్యోతి ఫటాఫట్ ఇంటర్వ్యూలో వివరించారు.

ప్రశ్న: జిల్లాలో ఎన్ని ఇసుక రీచ్‌లు ఉన్నాయి?

జవాబు : జిల్లాలో పెండ్లిమర్రి, నందిమండలం, కొత్తగంగిరెడ్డిపల్లె, వెదురూరు, విభరాపురం, గొల్లపల్లె, మామిళ్లవంక, ఏటూరు, వీజీ అనంతపురంతో పాటు మొత్తం 12 ఇసుక రీచ్‌లున్నాయి.

ప్రశ్న : ఎంత నిల్వ ఉన్నాయి. రోజువారి డిమాండ్ ఎంత ?

జవాబు : జిల్లాలో రోజూ 3 నుంచి 4వేల టన్నుల డిమాండ్ ఉంది. ప్రస్తుతం రీచ్‌లలో పదిలక్షల టన్నుల ఇసుక ఉంది. డిమాండ్‌కు తగ్గట్లుగానే ఎలాంటి ఇసుక కొరత లేదు. రీచ్‌లు అందుబాటులోకి రావడంతో రవాణా చార్జీల ధరలు కూడా తగ్గాయి.

ప్రశ్న: ఉచిత ఇసుక ఎవరెవరికి ?

జవాబు : నదీ పరివాహక ప్రాంతాల్లో 2 కి.మీ లోపు ఉన్న వారికి ఉచితంగా ఇసుక తీసుకెళ్లేందుకు ప్రభుత్వం అనుమతినిచ్చింది. ట్రాక్టర్లు, ఎడ్లబండ్ల ద్వారా తీసుకెళ్లవచ్చు. నిర్మాణానికి ఇసుక అవసరమని వీఆర్వో ధ్రువీకరిస్తే వాటికి సంబంధించి పత్రాలు చూపించి తీసుకెళ్లవచ్చు.

ప్రశ్న : రాబోవు రోజుల్లో నిర్మాణరంగం ఊపందుకునే అవకాశం ఉంది. దానికి తగ్గట్లు ఇసుక ఉందా ?

జవాబు: ఇప్పుడున్న రీచ్‌లతో పాటు మరో 7 రీచ్‌లు గుర్తించాం. అక్కడ ప్రజాభిప్రాయ సేకరణ అయ్యాక అవి అందుబాటులోకి వస్తాయి. డిమాండ్ మేరకు ఇసుక కొరత లేకుండా అందుబాటులో ఉంటుంది.

పల్లెల్లోనే పండుగంతా...

● సంక్రాంతికి పట్టణాల నుంచి పల్లెబాట.. ● బంధుమిత్రులతో కళకళలాడుతున్న పల్లెలు.. ● సంతోషంగా గడపడానికి యువత ప్రత్యేక కార్యక్రమాలు



నూలివీడులో చిట్లాకుప్ప వేయడానికి ట్రాక్టర్లతో కట్టెలు, కంప తెస్తున్న యువకులు

సంక్రాంతి.. ఈ పండుగకు తెలుగు లోగిళ్లలో ఉండే ప్రత్యేకతే వేరు.. ఏరువాకలో సాగు చేసిన పంటలు పండి... ధాన్యాన్ని ఇంటికి తెచ్చిన తర్వాత.. వచ్చే మొదటి పండుగ ఇదే.. మూడు రోజుల పాటు జరిగే ఈ పండుగ అంటే.. పల్లెల్లో ఒకటే హడావిడి.. కొత్త అల్లుళ్లు.. కొత్త కోడళ్ల సందడి.. కోడిపందేలు.. ఎద్దుల బండలాగుడు పోటీలు.. రంగు రంగుల ముగ్గుల పోటీలు.. గాలిపటాలు.. ఇలా ఎన్నో విశేషాలు.. ప్రత్యేకతలున్న సంక్రాంతికి.. పట్టణాల్లో ఉంటున్న వాళ్లు దాదాపు అందరూ.. పల్లెకు పోదాం..ఛలోఛలో అంటూ పల్లెలు చేరుకున్నారు. తమ స్వగ్రామాలకు చేరి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సంక్రాంతి సంబరాలు చేసుకుంటున్నారు.

(రాయచోటి-ఆంధ్రజ్యోతి): పల్లెల్లో సంక్రాంతి శోభ కొట్టొచ్చినట్లు కనపడుతోంది. పలు ప్రాంతాల్లో ఉద్యోగాలు చేస్తున్న యువతీ, యువకులు ఇప్పటికే వారి స్వగ్రామాలకు చేరుకున్నారు. వీరితో పాటు కొత్తగా పెళ్లి అయిన జంటలు, బంధుమిత్రులు అందరూ సంక్రాంతి కోసం పల్లెలకు చేరుకున్నారు. సంక్రాంతిని జరుపుకునే మూడు రోజులలో ఇప్పటికే భోగి పండుగను సంబరంగా జరుపుకున్నారు. ఇక సంక్రాంతి, కనుమ పండుగలను ఇంకా వైభవంగా జరుపుకునేందుకు సిద్ధమవుతున్నారు. మొదటి రోజు భోగి మంటలు వేసి గాలిపటాలు ఎగురవేయడంతో పాటు క్రికెట్, వాలీబాల్ వంటి ఆటలను ఆడినట్లు యువకులు తెలిపారు. కనుమ రోజు పశువులను బెదిరించడానికి కాటమరాజు దగ్గర చిట్లాకుప్పను సిద్ధం చేస్తున్నారు. కొంతమంది బండలాగుడు పోటీలు నిర్వహణకు సమాయత్తమవుతున్నారు.

ఎంతో ఘనంగా జరుపుకుంటున్నాం

- ఆకాశ్‌వర్మ, అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, రైల్వేకోడూరు



సంక్రాంతి పండుగను ప్రతి ఏడాది ఘనంగా జరుపుకుంటాం. అమెరికాలో ఇటువంటి వాతావరణం, పండుగలు జరుపుకునే వీలుండదు. ఏడాదికొకసారి సంక్రాంతి పండుగకు వచ్చి ఇక్కడ జరుపుకోవడంలో ఉన్న ఆనందం దేనిలోనూ ఉండదు. కుటుంబ సభ్యులను వదిలిపెట్టి చాలా కాలంగా ఇతర దేశాలలో ఉంటూ అక్కడ బిజీబిజీగా ఉంటాం. సంక్రాంతి పండుగ మూడు రోజులు తల్లిదండ్రులు, స్నేహితులు, కుటుంబ సభ్యులతో కలిసి ఉండడం చాలా సంతోషకరం.




అమెరికాలోని డల్లాస్‌లో భోగి వేడుకల్లో స్నేహితులతో మదనపల్లెకు చెందిన అఖిల్



వేల మైళ్లు దూరం వెళ్లినా సంక్రాంతిని మర్చిపోలేము

- అఖిల్ సాఫ్ట్‌వేర్ ఇంజనీరు, డల్లాస్, అమెరికా, మదనపల్లె

చిన్నప్పుడు చిట్లాకుప్పకు అగ్గిపెట్టి మంటల చుట్టూ గంతులేసే వాళ్లం.. అనపకాయలు కాల్చుకుని తినే వాళ్లం.. ఆ జ్ఞాపకాలను మరవలేక.. అమెరికాలో ఉన్నా.. భోగి, సంక్రాంతి పండుగలు జరుపుకుంటున్నాం.. పశువులు లేవు కాబట్టి.. ఇక్కడ కనుమ చేసుకోలేము. కానీ మన రాష్ట్రంలో జరిగే కనుమ పండుగను లైవ్‌లో చూస్తాం.. మన సంస్కృతీ సంప్రదాయాలను మర్చిపోకుండా.. ప్రతి ఏటా ఇక్కడ జరుపుకుంటాం..



కోడిపుంజుతో.. సరదాగా.. (గాలివీడు)



కుటుంబ సభ్యులతో సంక్రాంతి జరుపుకోవడం సంతోషం

- కోటా వెంకటమోహన్, బావులకాడపల్లె, ఎస్.సోమవారం, సంబేపల్లె



సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా బెంగళూరులో పనిచేస్తున్నాను. పండుగలు వస్తే అదో సంతోషం. కుటుంబ సభ్యులు, బంధువులతో అందరితో సంతోషంగా గడపడమే పండుగ ప్రత్యేకత. ప్రతిరోజు ఉద్యోగరీత్యా ఒడిదుడుకులు బిజీబిజీగా గడిపే మేము సంక్రాంతి వచ్చిందంటే అదో సంతోషం. ఊరికి రాగానే.. కనిపించే పెద్దలు.. పేరు పెట్టి పిలిచి.. ఎప్పుడొచ్చావు. అంటూ ఆప్యాయంగా పలకరించే వాళ్ల పిలుపులు ఆనందాన్ని ఇస్తాయి. సంక్రాంతి అనగానే.. దూర ప్రాంతాల నుంచి చిన్ననాటి స్నేహితులు ప్రతిఒక్కరూ పల్లెకు వస్తారు. వారితో సరదాగా గడుపుతాం. మూడు రోజుల పాటు ఆనందాన్ని పంచుకోవడం మరపురాని అనుభూతి.

మూడు రోజులూ సందడే.. సందడి..

- గణేష్‌నాయుడు, బావులకాడపల్లె, ఎస్.సోమవరం



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఉద్యోగం చేస్తున్నా.. సంక్రాంతి వస్తోందంటే చాలు.. స్నేహితులకు ఫోన్ చేసి పండుగకు రమ్మని అందరికీ చెప్తాం.. అందరం దాదాపు పల్లెకు వస్తాం.. సంక్రాంతి మూడు రోజులూ గ్రామంలో సందడే సందడిగా గడుపుతాం. ఈ ఏడాది గ్రామంలో సందడి చేసేందుకు మహిళలకు రంగవల్లి పోటీలను కూడా నిర్వహిస్తున్నాం. బుధవారం ఈ పోటీలు నిర్వహిస్తాం. గ్రామం అంతా కలిసి మధ్యాహ్నం, రాత్రికి భోజనాలు చేస్తాం. ముగ్గుల పోటీల్లో మొదటి బహుమతి గెలిచిన విజేతకు వాషింగ్ మిషన్, రెండవ బహుమతి వాటర్‌ఫిల్టర్, మూడవ బహుమతి మిక్సీ, నాలుగో బహుమతి కూలింగ్ ఫ్యాన్, ఐదవ బహుమతి ఐరన్‌బాక్స్ బహుమతులను అందిస్తాం. సంక్రాంతి మూడు రోజులు సందడిగా గడపడమే సంతోషం.

సంక్రాంతి అంటేనే.. సంబరాలు

- నవ్యశ్రీ తేజ, న్యాయవిద్యార్థి, చిన్నమండెం



పండుగలు ఎన్నో ఉంటాయి. అయితే సంక్రాంతి అంటే చాలా ఇష్టం. ఈ పండుగకు ఎక్కడో దూరంగా ఉన్న మా బంధువులు అందరూ వచ్చారు. నేను తిరుపతి మహిళా యూనివర్సిటీలో న్యాయశాస్త్రం చదువుతున్నాను. సంక్రాంతి కోసం సొంత ఊరికి వచ్చాను. ఈ మూడు రోజులు అందరం సంతోషంగా పండుగను జరుపుకుంటాము.. మా అమ్మ వాళ్లు ఇప్పటికే పిండివంటలు తయారు చేశారు. కనుమ రోజు చిట్లాకుప్ప దగ్గరకు వెళ్తాం.

చిన్ననాటి జ్ఞాపకాలు మదిలో పదిలం



- రెడ్డిశేఖర్, వంకోళ్లపల్లె, చిన్నమండెం

నేను బెంగళూరులో ఉద్యోగం చేస్తున్నాను. బెంగళూరు సిటీలో సంక్రాంతి పండుగ వాతావరణం ఉండదు. దీంతో ఐదు రోజులు సెలవు తీసుకుని ఇంటికి వచ్చి కుటుంబ సభ్యులతో కలిసి పిండివంటలు చేస్తున్నాము. గతంలో మాకు ఎద్దులు ఉండేవి. మా చిన్నతనంలో కనుమ రోజు ఉదయాన్నే లేచి ఎద్దులకు స్నానాలు చేయించి.. కొమ్ములను రంగురంగుల పేపర్లతో అలంకరించే వాళ్లం. వీటితో పాటు మెడలో మూగపట్టీలు వేసి.. నుదుట బిల్లలు కట్టి కొమ్ములకు రంగుల బుడ్డలు కూడా అలంకరించే వాళ్లం. అలా అలంకరించిన ఎద్దులను చిట్లాకుప్ప వద్దకు తీసుకెళ్లి బెదిరించే వాళ్లం. నేను 14 సంవత్సరాలుగా బెంగళూరులోని ఓ కంపెనీలో పనిచేస్తూ. ప్రతి పండుగకు తప్పనిసరిగా ఇంటికి వచ్చి బంధుమిత్రులు, కుటుంబ సభ్యులతో సంక్రాంతి పండుగను జరుపుకుంటాము. చిన్ననాటి సంక్రాంతి జ్ఞాపకాలు ఎప్పటికీ మదిలో పదిలంగానే ఉంటాయి.

సంక్రాంతి పండుగ అంటే. ఉరకలేస్తాం

- దక్షిరాజు కిరణ్‌కుమార్, మాధవరం పోడు, రైల్వేకోడూరు



నేను బెంగళూరులో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా పనిచేస్తున్నాను. సంక్రాంతి పండుగ వచ్చిందంటే చాలు ఉరకలేస్తూ స్వగ్రామానికి చేరుకుంటాం. కుటుంబ సభ్యులందరం కలిసి కొత్తబట్టలు కొనుగోలు చేసి భోగి పండుగ నుంచి మూడు రోజుల పాటు వాటిని ధరించి పిల్లలతో ఆనందంగా గడుపుతాం. కుటుంబ సభ్యులతో కలిసి పలు రకాల పిండి వంటలు తింటూ ఉంటే.. అందులో ఉండే గమ్మత్తు వేరుగా ఉంటుంది. ఎప్పుడూ కంప్యూటర్ దగ్గర కూర్చుని ఉద్యోగం చేసుకుంటూ బిజీబిజీగా ఉండే సమయాన్ని విడిచిపెట్టి.. సుమారు నాలుగు రోజుల పాటు. సంక్రాంతి శోభను చూస్తుంటే.. ఆనందడోలికల్లో మునిగిపోతాం.

సంక్రాంతి సంబరాల్లో న్యాయమూర్తి



భోగి మంటల వద్ద కుటుంబ సభ్యులతో న్యాయమూర్తి శిరీష్

ప్రొద్దుటూరు రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు మండలం ఉప్పరపల్లె పంచాయతీ పరిధిలోని బొజ్జవారిపల్లెలో నిర్వహించిన సంక్రాంతి సంబరాల్లో మదనపల్లిలోని సీనియర్ సివిల్ జడ్జి కోర్టు న్యాయమూర్తి నాదేళ్ల శిరీష్ పాల్గొన్నారు. బొజ్జవారిపల్లెకు చెందిన రిటైర్డు ఆర్టీసీ అధికారి సుబ్బన్న, శ్రీదేవి దంపతుల కుమార్తె సులక్షణతో నాదేళ్ల శిరీష్‌కు వివాహమైంది. పండుగ సందర్భంగా అత్తగారి ఊరికి చేరుకున్న న్యాయమూర్తి కుటుంబ సభ్యులతో కలిసి భోగి మంటల్లో పాల్గొన్నారు. గ్రామంలోని రామాలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఎండ్ల బండిలో కుటుంబ సభ్యులతో కలిసి గ్రామంలో తిరిగి సందడి చేశారు.

వైభవంగా రంగనాథస్వామి కల్యాణం

నందలూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక చెన్నకేశస్వామి ఆలయంలో సోమవారం యంబలూరు అనిల్‌కుమార్, రాధిక దంపతుల ఆధ్వర్యంలో గోదాదేవి, రంగనాథస్వామి కల్యాణం నిర్వహించారు. కల్యాణం అనంతరం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో పల్లె మోహన్, సుబ్బరాయుడు, శ్రీను, సుబ్బరాయుడు పాల్గొన్నారు. ఈ కల్యాణానికి లక్ష్మీ చెన్నకేశవస్వామి ఆలయ కమిటీ వారు సహకరించారు.

వీరభద్రాలయంలో ఘనంగా పల్లకీ ఉత్సవం



వీరభద్రాలయంలో పల్లకీ ఉత్సవాన్ని నిర్వహిస్తున్న ఆలయ సిబ్బంది

రాయచోటిటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పట్టణంలోని భద్రకాళీ సమేత వీరభద్రాలయంలో సోమవారం భోగి పండుగ, పౌర్ణమి సందర్భంగా పల్లకీ ఉత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా వీరభద్రస్వామి, భద్రకాళీ అమ్మవార్ల ఉత్సవ విగ్రహాలను వివిధ రకాల పుష్పాలు, పట్టు వస్త్రాలతో సర్వాంగ సుందరంగా అలంకరించి బ్యాండు మేళాలతో మాడవీధుల్లో పల్లకిపై ఊరేగించారు. ఆలయ ఈవో టీవీ రమణారెడ్డి, ప్రధాన అర్చకులు శంకరయ్య, కృష్ణయ్య స్వాములు పాల్గొన్నారు.

12 మంది ఎర్రచందనం స్మగ్లర్ల అరెస్ట్

● 28 దుంగలు స్వాధీనం

పుల్లంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిదిలోని అనంత సముద్రం సమీపంలో కందిరీగల గుట్ట వద్ద మండలానికి చెందిన 12 మంది ఎర్రచందనం స్మగ్లర్లను అరెస్ట్ చేసి వారి నుంచి 28 దుంగలను స్వాధీనం చేసకున్నామన్నామని రాజంపేట డీఎస్పీ సుధాకర్ తెలిపారు. సోమవారం ఆయన పుల్లంపేట పోలీసుస్టేషన్‌లో ప్రెస్‌మీట్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్పీ ఆదేశాలతో వీరిని పట్టుకుని వారి నుంచి 28 దుంగలను స్వాధీనం చేసుకుని అరెస్ట్ చేసి రిమాండ్‌కు పంపామన్నారు. పట్టుబడ్డ దుంగల విలువ 8 లక్షల రూపాయలు ఉంటుందన్నారు. ఎర్రచందనం స్మగ్లింగ్ చేస్తుంటే ఎంతటివారినైన వదిలిపెట్టేది లేదని హెచ్చరించారు. కార్యక్రమంలో పుల్లంపేట ఎస్ఐ మోహన్ కుమార్‌గౌడ్, నందలూరు ఎస్ఐ వెంకటేశ్వర్లు, సిబ్బంది పాల్గొన్నారు.

ఇక్కడ పల్లె పండుగ లేదా...?

● అధ్వానంగా రోడ్లు
● వాహనదారులకు తప్పని కష్టాలు
● ప్రభుత్వం నిధులు ఇచ్చినా ఫలితం శూన్యం
● ప్రభుత్వ ఆశయానికి తూట్లు



గుంతలుగా మారి వర్షపు నీటితో నిండిన అగ్రహారం నుంచి బలిజపల్లెకు వెళ్లే మట్టి రోడ్డు

సుండుపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గత వైసీపీ నిర్వాకంతో గ్రామీణ ప్రాంతాల రోడ్లు గుంతల మయంగా మారాయి. అభివృద్ధి తుంగలో తొక్కి జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఆర్భాటం ప్రకటలనకే పరిమితమైంది. ఇందుకు ప్రజలు అష్టకష్టాలు పడాల్సిన పరిస్థితి ఎదురవుతుంది. అయితే కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు సంక్రాంతి పండుగ నాటికి పట్టణాల నుంచి పల్లెలకు వచ్చే ప్రయాణికులకు ఇబ్బంది లేకుండా గుంతలు లేని రోడ్లే లక్ష్యంగా పూర్తి చేయాలని పల్లె పండుగ పేరిట కోట్లాది రూపాయల నిధులను విడుదల చేశారు. గత ప్రభుత్వంలో తప్పులు జరిగాయి. ఆ తప్పులను పూడ్చేందుకు పట్టణాలు, గ్రామీణ ప్రాంతాల రోడ్లకు మహర్దశ తీసుకువచ్చేందుకు ప్రజా ప్రతినిధులు, పాలకులను భాగస్వాములను చేస్తూ రోడ్లు వేసేందుకు నిధులు విడుదల చేస్తామని ప్రకటించారు. రాష్ట్రవ్యాప్తంగా అన్ని చోట్ల పల్లె పండుగ పేరిట రోడ్లు వేసి గుంతలు లేకుండా చేస్తున్నారు. అయితే సుండుపల్లె మండలంలో మాత్రం పల్లెపండుగ పనులు ప్రారంభం కాలేదు. సుండుపల్లె మండలంలో రోడ్లు వేసేందుకు రాష్ట్రప్రభుత్వం రూ.1.50 కోట్ల నిధులను విడుదల చేశారు. అయినా పనులు ప్రారంభించకపోవడంతో పండుగకు పల్లెలకు వచ్చే స్థానికులు, అతిథులు అష్టకష్టాలు పడాల్సి వస్తోంది.

గతంలో హైరానా

సుండుపల్లె మండల కేంద్రంలో సీసీ రోడ్లు, ఆర్అండ్‌బీ రోడ్లు, మట్టి రోడ్లు గుంతల మయంగా మారడంతో మండల కేంద్రానికి వచ్చే వారు. పోయేవారు అష్టకష్టాలు పడుతున్నారు. సుండుపల్లె, రాయవరం ప్రధాన రహదారిలో కెనరా బ్యాంకు సమీపంలో ఇళ్లలోని మురికినీరు, వర్షపు నీరు రోడ్డుపై ప్రవహిస్తుండటంతో ప్రజలు, వాహనదారులు ఇబ్బందులు పడుతున్నారు. ఎంపీడీవో కార్యాలయ సమీపంలో ఎంపీడీవో ఆఫీసు నుంచి అగ్రహారం వెళ్లే రహదారిలో సీసీ రోడ్లు పలుచోట్ల పెద్ద పెద్ద గుంతలుగా ఏర్పడి ప్రయాణికులు కిందపడి గాయాలపాలువుతున్నా ఎవరూ పట్టించుకోవడం లేదు. అగ్రహారం నుంచి ఏటిగడ్డరాచపల్లి, బలిజపల్లె, సామిసేనిగడ్డ ఇతర పల్లెలకు వెళ్లే రోడ్లు సుమారు ఐదు కిలోమీటర్ల వరకు గుంతలుగా మారింది. జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల దగ్గర నుంచి సాకలపల్లి, కుమ్మరపల్లి, కొత్త వడ్డెపల్లె, రవీంద్రనాధ్‌రెడ్డి కాలనీ, పోచంపల్లి, పోచంవాండ్లపల్లె, ఎల్లారెడ్డిగారిపల్లెలకు వెళ్లే రహదారులు, అంతేగాకుండా పెద్దినేనికాలువ గ్రామ పంచాయతీ బత్రాజుగారిపల్లెకు వెళ్లే మట్టి రోడ్లు దశాబ్దాల కాలంగా మట్టి రోడ్లగానే మిగిలిపోయాయి. గత ప్రభుత్వంలో రోడ్లు వేస్తామని తవ్వి గుంతల మయంగా మార్చేశారని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. అంతేగాకుండా మండల కేంద్రంలో కూడా ఆరెమ్మ వీధి, ఇందిరానగర్, జనార్ధన్‌నగర్ కాలనీలో ఇప్పటికీ మట్టి రోడ్లే దర్శనమిస్తున్నాయి. అంతేగాకుండా మూడు సంవత్సరాల క్రితం రాయచోటి నుంచి సుండుపల్లెకు డబుల్ రోడ్డు పనులను ప్రారంభించారు. అటవీ ప్రాంతంలో అనుమతులు రాకపోవడం వలన పనులు ఆగిపోయాయి. ప్రభుత్వం పల్లె పండుగ పేరిట నిధులు విడుదల చేసింది. ఈ ప్రభుత్వంలోనైనా రోడ్లు వేస్తారని భావించాము. నిధులు వచ్చినా పనులు ప్రారంభించకపోవడం బాధాకరం అని ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

త్వరలో పనులు ప్రారంభిస్తాము

-సుధాకర్‌రెడ్డి, ఎంపీడీవో, సుండుపల్లె

త్వరలో పల్లె పండుగ పనులు ప్రారంభిస్తాము. సుండుపల్లె మండలానికి రూ.1.50 కోట్లు నిధులను ప్రభుత్వం కేటాయించింది. పనులు గుర్తించాము. ప్రధాన రోడ్ల సమస్యలు పరిష్కరిస్తాము.

అప్పుడు ప్రారంభించారని ఆపేశారు

2018 అప్పటి టీడీపీ ప్రభుత్వంలో మండలంలోని చిన్నగొల్లపల్లె గ్రామ పంచాయతీ ఆర్‌కే రోడ్డు నుంచి పూజారివాండ్లపల్లె వరకు 1.40 కిలోమీటర్ల రోడ్డు ఏర్పాటుకు రూ.56 లక్షల వ్యయంతో పనులు ప్రారంభించారు. మూడుచోట్ల కల్వర్టులు నిర్మించారు. సుమారు రూ.15 లక్షల వరకు నిధులు వెచ్చించి పనులు చేశారు. మడితాడు గ్రామంలోని రాయవరం రోడ్డు నుంచి నాయునివారిపల్లెకు పోయే రహదారిలో రూ.62 లక్షలతో 1.50 కిలోమీటర్లు రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.34 లక్షలు వెచ్చించి పనులు చేశారు. అలాగే జీకే రాచపల్లె సమీపంలో రాయవరం రోడ్డు నుంచి కోనేరువాండ్లపల్లెకు రూ.58 లక్షలతో 1.05 కిలోమీటర్లు రోడ్డు పనులు ప్రారంభించారు. రూ.24 లక్షలు వెచ్చించి పనులు చేశారు. ఆ తర్వాత వచ్చిన వైసీపీ ప్రభుత్వం ఈ పనులన్నింటినీ రద్దు చేసింది. దీంతో రహదారి పనులు అర్ధంతరంగా ఆగిపోవడంతో వాహనదారులు, ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. కూటమి ప్రభుత్వంలోనైనా పనులు పూర్తి చేయాలని ప్రజలు కోరుతున్నారు.



వైసీపీ ప్రభుత్వం రాగానే అర్ధంతరంగా ఆపేసిన రోడ్డు పనులు

పల్లె పండుగకు రాజకీయ గ్రహణం

వైసీపీ ప్రభుత్వంలో నిధులు లేవని ప్రభుత్వం ఇవ్వడం లేదని, అభివృద్ధి కుంటుపడిందన్న విషయం అందరికీ తెలిసిందే. అయితే కూటమి ప్రభుత్వం ఏర్పడ్డాక స్వయంగా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు రాష్ట్ర వ్యాప్తంగా నిధులు విడుదల చేశారు. అందులో భాగంగా సుండుపల్లె మండలానికి రూ.1.50 కోట్లు కేటాయించారు. నిధులు వచ్చాయని సంబరపడే లోపు టీడీపీలోని నియోజకవర్గ కీలక నేతల మధ్య సఖ్యత లేకపోవడం వలన పల్లె పండుగ పనులు ప్రారంభం కాలేదు. సంక్రాంతి పండుగలోపు గుంతలు లేని రోడ్లుగా మార్చాలని పనులు ప్రారంభించి దాదాపు పూర్తి చేసినా ఇక్కడ మాత్రం పనులే ప్రారంభం కాలేదు. నిధులు విడుదల చేసిన వెంటనే పనులు ప్రారంభించి ఉంటే ఇప్పటికి దాదాపు రోడ్లు పూర్తయ్యేవి. గత ప్రభుత్వంలో చేయలేదని విమర్శిస్తున్నారు. కానీ ఈ ప్రభుత్వంలో నిధులు విడుదల చేసినా పనులు చేయడం లేదని టీడీపీ నేతల తీరుపై ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ముఖ్యమంత్రి ఆదేశించినా పనులు చేయకపోవడం ఏమిటో అర్థం కావడం లేదని పలువురు కూటమి నాయకులే ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

బాలుడికి విద్యుత్ షాక్

- గాలిపటం ఎగురవేస్తుండగా ఘటన
- పరిస్థితి విషమం

కడప క్రైం. జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భోగిపండుగ సందర్భంగా ఓ బాలుడు గాలిపటం ఎగురవేస్తున్న సమయంలో విద్యుత్ తీగలు తగిలి షాక్‌కు గురయ్యాడు. స్థానికులు ఆ బాలుని చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించారు. పరిస్థితి విషమించడంతో వైద్యులు సూచనల మేరకు ఇతర ప్రాంతానికి తరలించారు. కడప నగరం శాంతినగర్‌కు చెందిన ఓ బాలుడు సాయంత్రం గాలిపటం ఎగురవేస్తూ ఆడుకుంటుండేవాడు. గాలిపటం విద్యుత్ వైర్లకు తగలడంతో ఆ బాలుడు తప్పించబోయి గట్టిగా లాగినట్లు తెలుస్తోంది. దీంతో విద్యుత్ వైరు ఆ బాలుడిపై పడడంతో తీవ్ర గాయాలయ్యాయి. చికిత్స నిమిత్తం రిమ్స్‌కు తరలించగా.. పరిస్థితి విషమంగా ఉండటంతో మెరుగైన వైద్యం కోసం ఇతర ప్రాంతానికి తరలించారు. రిమ్స్ పోలీసులు విషయం తెలుసుకుని రిమ్స్‌కు వెళ్లారు. ఇందుకు సంబంధించి పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

చోరీ కేసులో వ్యక్తి అరెస్టు

చాపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): బంగారు నగల చోరీ కేసులో నిందితుడు కోవర్ల ప్రసన్నకుమార్‌ను సోమవారం అరెస్టు చేసినట్లు పోలీసులు తెలిపారు. మండలంలోని మొరాయిపల్లెలో ఈనెల 6వ తేదీ చంద్రాయుడు అనే వ్యక్తి ఇంటిలో అదే గ్రామానికి చెందిన ప్రసన్నకుమార్ సుమారు రూ.2లక్షలు విలువచేసే బంగారు నగలు చోరీ చేశాడు. అతని వద్ద నుంచి బంగారు నగలను స్వాధీనం చేసుకొని, మైదుకూరు కోర్టులో హాజరుపరచగా రిమాండ్ విధించినట్లు తెలిపారు.

పెనగలూరులో ఓ మోస్తరు వర్షం

పెనగలూరు/ ఓబులవారిపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : ఉపరితల ఆవర్తనం కారణంగా సోమవారం సాయంత్రం పెనగలూరు, ఓబులవారిపల్లె మండలాల్లో ఓ మోస్తరు వర్షం కురిసింది. పండుగ పూట వర్షం కురవడంతో ప్రజలు నిరుత్సాహానికి గురయ్యారు. మహిళలు ఇళ్ల ముందు వేసిన ముగ్గులు వర్షం కారణంగా పాడైపోయాయి. క్రికెట్ పోటీలు తాత్కాలికంగా వాయిదాపడ్డాయి. బంధుమిత్రులతో ఆనందంగా గడుపుదామని దూర ప్రాంతాల నుంచి స్వగ్రామాలకు చేరుకున్న పలువురు చలి కారణంగా బయటకు రాలేక ఇళ్లలోనే గడిపారు.

బొప్పాయి తోటపై అడవి పందుల దాడి

చిట్వేలి, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మైలపల్లె పంచాయతీ ఎం.రాచపల్లిలో ఈశ్వరరాజుకు చెందిన 5500 బొప్పాయి మొక్కలను ఆదివారం రాత్రి అడవి పందులు ధ్వంసం చేశాయి. దీంతో రైతుకు 80 వేల నుంచి లక్ష వరకు నష్టం వాటిల్లినట్లు అంచనా. సోమవారం ఉదయం పొలం వద్దకు వెళ్లిన రైతుకు పొలం ఖాళీగా కనిపించింది. ఎఫ్‌బీవో కరీం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ఉన్నతాధికారులకు నివేదించి పంట నష్టం అందేలా కృషి చేసానని రైతుకు హామీ ఇచ్చారు.

ఆకేపాడులో బండలాగుడు పోటీలు



మొదటి స్థానంలో నిలిచిన ఎద్దుల యజమానికి నగదు బహుమతి అందజేస్తున్న ఎమ్మెల్యే ఆకేపాటి

రాజంపేట టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని ఆకేపాడులో ఎమ్మెల్యే ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి ఆధ్వ ర్యంలో సోమవారం బండలాగుడు పోటీలు నిర్వహించారు. హోరాహోరీగా సాగిన ఈ పో టీల్లో ఆలంఖాన్‌పల్లె వెంకట రామిరెడ్డి, రూకవారిపల్లెకు చెందిన ఓబుల్‌రెడ్డి ఎద్దులు 4800 మీటర్లు బండను లాగి ప్రథమ బహుమతి కింద 50వేల రూపాయల నగదును గెలుచుకున్నారు. రెండో బహుమతికి కింద వంశీరెడ్డి హేమంత్‌రెడ్డికి చెందిన ఎద్దులు కైవసం చేసుకుని 40 వేల రూపాయల బహుమతి సాధించారు. విష్ణువర్ధన్‌రెడ్డి ఎద్దులు మూడో బహుమతిని పొంది 30వేల రూపాయలను కైవసం చేసుకున్నాయి. విశ్వనాథ్‌రెడ్డి ఎద్దులు నాలుగో స్థానంలో నిలిచి 20 వేల రూపాయలు, డి.భావన, ఖాదర్‌ఖాన్ ఎద్దులు 5వ బహుమతిని పొంది 10 వేల రూపాయల బహుమతిని పొందారు. పాల్గొన్న వారందరికి 5 వేల రూపాయల ప్రోత్సాహక బహుమతిని అందజేశారు. ఎమ్మెల్యే సోదరుడు, రాజంపేట నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి ఆకేపాటి అనిల్ కుమార్‌రెడ్డి, ఏపీఎండీసీ మాజీ ఎంపీ వెంకటరెడ్డి, మాసీమ బాబు, రైతు ప్రసాద్‌రెడ్డి పాల్గొన్నారు.





వైభవంగా గోదాదేవి కల్యాణోత్సవం





మాంగళ్యధారణను భక్తులకు చూపిస్తున్న వేద పండితులు, గోవిందనామస్మరణ చేస్తున్న భక్తులు

వల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధిగాంచిన పుష్పగిరి క్షేత్రంలో భోగి పండుగ సందర్భంగా రాజ్యలక్ష్మి సమేత చెన్నకేశవాలయంలో గోదాదేవి కల్యాణం వైభవంగా నిర్వహించారు. అంతకు ముందు తెల్లవారుజామునే లక్ష్మీచెన్నకేశవస్వాములకు విశేషంగా పంచామృతాభిషేకాలు చేశారు. అనంతరం ఉత్సవ విగ్రహాలను సుందరంగా అలంకరించి కల్యాణ వేదిక వద్దకు మంగళవాయిద్యాల నడుమ తీసుకువచ్చారు. అనంతరం ముందుగా విశ్వక్సేన ఆరాధన గావించారు. గణపతి స్వస్తిక్ నిర్వహించి.. కంకణధారణ చేపట్టారు. అనంతరం జిలకర, బెల్లాన్ని దేవేరులకు దేవతామూర్తులకు శిరస్సుపై ఉంచి కన్యాదానం నిర్వహించి.. పాద ప్రక్షాళన చేపట్టారు. చివరి ఘట్టంగా మాంగల్యం తంతునానేనా లోకరక్షణ హేతునా అంటూ వేద పండితుల మంత్రోచ్చారణలు, భక్తుల గోవిందనామస్మరణతో గోదాదేవి కల్యాణం వైభవగా నిర్వహించారు. అనంతరం వచ్చిన భక్తులకు ముత్యాలు, అక్షింతలను కార్యనిర్వాహకులు అందజేశారు.

నిత్యాన్నదాన పథకానికి రూ.లక్ష విరాళం



అన్నదానానికి విరాళం అందిస్తున్న దాతలు

చక్రాయపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): గండి వీరాంజనేయస్వామి దేవస్థానంలో జరిగే శాశ్వత నిత్యాన్నదాన పథకానికి ప్రొద్దుటూరు వాస్తవ్యులు అంజగల రామాంజనేయులు, కాంతమ్మ దంపతులు లక్ష రూపాయలు విరాళంగా ఇచ్చారు. వీరికి ఆలయ ప్రధాన అర్చకులు కేసరి, పాలక మండలి మాజీ చైర్మన్ కల్లూరు వెంకటస్వామి స్వామివారి దర్శనం చేయించి ఆలయ మర్యాదలతో సత్కరించి తీర్థప్రసాదాలు అందజేశారు.

వైభవంగా కాశీవిశ్వేశ్వరస్వామికి అన్నాభిషేకం



స్వామివారికి అన్నాభిషేక కార్యక్రమ దృశ్యం

కడప కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పుష్యమాస ఆరుద్ర నక్షత్రం సందర్భాన్ని పురష్కరించుకుని నగర ఆకుల వీధిలో వెలసిన రాజరాజేశ్వరీదేవి దేవస్థానంలో వెలసిన కాశీవిశ్వేశ్వరస్వామికి సోమవారం ఆ ఆలయ ప్రధాన అర్చకులు పిడతల గోపాలకృష్ణశర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, సహస్ర లింగార్చన, అన్నాభిషేకం తదితర కార్యక్రమాలు వైభవోపేతంగా నిర్వహించారు. కార్యక్రమంలో పలువురు భక్తులు హాజరై స్వామివారిని దర్శించుకున్నారు.

కళలను ప్రోత్సహించాలి : బీజేపీ

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ కళలు ఎంతో విశిష్టమైనవని కళలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. స్థానిక శ్రీకృష్ణ గీతాశ్రమంలో నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయలసీమ సంగీత నృత్యోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నటరాజ కళాక్షేత్రం నాట్య గురువు మొహిద్దీన్‌ఖాన్ రెండు దశాబ్దాలకుపైగా ప్రొద్దుటూరు పట్టణంలో చిన్నారులకు నాట్యకళలను నేర్పిస్తూ.. ఎంతోమందిని నాట్య కళాకారులుగా తీర్చిదిద్దారన్నారు. యోగాకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తెచ్చినట్లుగానే భారతీయ సంస్కృతి, సాంప్రదాయాలకు, కళలకు ప్రపంచ వ్యాప్తంగా గుర్తింపు తేవడానికి కేంద్ర ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. నాట్యకళకు దేశవ్యాప్తంగానే కాక విదేశాల్లో కూడా విశేష ఆదరణ ఉందని తెలిపారు. బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్ మాట్లాడుతూ ప్రొద్దుటూరును కూచిపూడి నృత్యానికి కేంద్రంగా మొహిద్దీన్‌ఖాన్ మార్చారని పేర్కొన్నారు. కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్రదీప్‌రెడ్డి, ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, నాట్య కళాప్రపూర్ణ డాక్టర్ ఖాజా వెంకటసుబ్రమణ్యం, కేంద్ర, సాంస్కృతిక శాఖ సభ్యుడు డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషన్‌రెడ్డి

పుష్పగిరి గిరి ప్రదక్షిణలో అడిషనల్ ఎస్పీ



పాదరాయి వద్ద పూజలు చేస్తున్న అడిషనల్ ఎస్పీ రమణయ్య

వల్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పౌర్ణమి సందర్భంగా పుష్పగిరి మహాక్షేత్రంలో పుష్పగిరి తీర్థ క్షేత్ర ధర్మపరిరక్షణ సమితి వ్యవస్థాపక అధ్యక్షుడు సట్టిభారవి ఆధ్వర్యంలో జరిగే గిరి ప్రదక్షిణ కార్యక్రమానికి అడిషనల్ ఎస్పీ బి.రమణయ్య హాజరయ్యారు. ముందుగా ఆయన పాదరాయి వద్ద పూజలు నిర్వహించి.. గిరి ప్రదక్షిణ చేసి చెన్నకేశవ స్వామి, సంతాన మల్లేశ్వరస్వామి అమ్మవారిని దర్శించుకున్నారు. అనంతరం కల్యాణ మహోత్సవంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో సమితి సభ్యులు కొండారెడ్డి, రత్నం, సునీల్, సత్యానారాయణగాంధి, కూన ఈశ్వర్‌రెడ్డి, వర ప్రసాద్, సునందమ్మ, ఈశ్వర్‌రెడ్డి, బసిరెడ్డి, ఉదయ్‌కుమార్, సుబ్బారెడ్డి, భాస్కర పాల్గొన్నారు.





త్రుటిలో తప్పిన ప్రమాదం






నడిరోడ్డుపై తెగిపడిన 11 కేవీ విద్యుత్ వైర్లు, గమనిస్తున్న ఆటోలోని ప్రయాణికులు

అట్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని కమలకూరు సమీపంలో సోమవారం తారు రోడ్డుపై 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడ్డాయి. అదృష్టవశాత్తు పెద్ద ప్రమాదం తప్పింది. ఆ సమయంలో ఆటోలో వెళుతున్న ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులు 11 కేవీ విద్యుత్ తీగలు తెగిపడటం సమీపం నుంచి గమనించడంతో ప్రమాదం తప్పింది. వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు ఫోను ద్వారా సమాచారం తెలపడంతో విద్యుత్ అధికారులు వచ్చి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించినట్లు గ్రామస్తులు తెలిపారు. గతంలో కూడా ఇటువంటి సంఘటనలు జరిగాయని, విద్యుత్ సిబ్బంది నిర్లక్ష్యం వల్ల ఇలాంటి సంఘటనలు జరుగుతున్నాయని తెలిపారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి ముందు జాగ్రత్త చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.





ప్రతి ఒక్కరూ సన్మార్గంలో నడవాలి

● అంతర్జాతీయ ప్రసంగీకుడు డాక్టర్ ప్రసన్నకుమార్



మాట్లాడుతున్న డాక్టర్ టి.డి ప్రసన్నకుమార్

కడప కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నేటి సమాజంలో చెడిపోతున్న ఆత్మలను రక్షించేందుకు దేవుని వాక్య పరిచర్య ముమ్మరంగా కొనసాగించి తద్వారా యేసు క్రీస్తు ఆశీస్సులు పొంది పాపపు జీవితాన్ని వదలిపెట్టి సన్మార్గంలో నడవాలని అంతర్జాతీయ ప్రసంగీకులు డాక్టర్ టి.డి. ప్రసన్నకుమార్ ప్రజలకు సూచించారు. నగర 48వ డివిజన్ కృపా కాలనీలో సోమవారం పాస్టర్ పి.మహేష్, సిస్టర్ పి. శాంతమ్మల ఆధ్వర్యంలో నూతనంగా ఏర్పాటుచేసిన న్యూనేటివ్ కృపా ప్రార్థనా మందిర ప్రారంభోత్సవ కార్యక్రమం నిర్వహించారు. ముఖ్య అతిథిగా ఆయన హాజరై మాట్లాడారు.

PUBLIC NOTICE

Under the Instructions of client **Shaik Parveez Mohiddin S/o Shaik Ghouse Mohiddin,** resident of D.No.5/231, Kotagadda, Kadapa City, Kadapa Dist. I am issuing the following notice to the general public that my client is going to mortgage the below mentioned property as security by way of registered mortgage. The original registered link document bearing Doc No.1596/2001 dated 22.03.2001 was executed by Shaik Kurshid Begum in favor of Shaik Gousiya @ Shameem Begum & Shaik Gouse Mohiddin and another original registered link document bearing Doc No.4141/1976 dated.30.07.1976 was executed by Syed Sofiya Bi & Patan Rahim Khan in favor of Shaik Kurshid Begum was misplaced. If anyone has claims objections shall be informed to the below mentioned address within 7 days from the date of issuance of the notice along with undersigned necessary documentary evidence. If no objections are received from public, further action will be taken concluding that the property is free all claims an objections from the public. **SCHEDULE :** RCC house with site property having D.No.51231 Assessment No. 1013007668 situated at YSR Kadapa District, Kadapa Urban Sub District, Kadapa Municipal Corporation area, Kadapa town, Kotagadda street in the village fields of Kadapa Town in S.No. 30/2B /1A1 pyki an extent of 90 Sq.yards.With in these **Boundaries**:- East: Rastha, West: House of Jafurulla Khan, North : House of Nasim Begum having D.No.5/230, South : House of A.Najirunnisa Begum

V. SUNIL KUMAR REDDY, B.Sc. (Comp.) LL.B.
ADVOCATE, Proddatur, 98854 30399

కమనీయం.. కల్యాణం

వేంపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వేంపల్లె వృషభాచలేశ్వర స్వామి అనుబంధ వేంకటేశ్వరస్వామి ఆలయంలో కల్యాణోత్సవం కమనీయంగా జరిగింది. ధనుర్మాసం భోగి పండుగను పురస్కరించుకొని ప్రతి ఏటా నిర్వహించే గోదాదేవి సమేత వేంకటేశ్వరస్వామి కల్యాణం సోమవారం సాయంత్రం కన్నుల పండువగా జరిగింది. ఆలయ పూజారి అచ్యుత్ ఆధ్వర్యంలో ఈ వేడుక ఘనంగా నిర్వహించారు. పెద్ద ఎత్తున భక్తులు హాజరై కల్యాణం తిలకించి పులకించారు. ఆలయ ఈఓ విశ్వనాథరెడ్డి, మాజీ దేవస్థాన సభ్యులు పి.వి రమణ పాల్గొన్నారు.

పతంగులతో చిన్నారుల సంబరాలు



సంక్రాంతి సంబరాల్లో భాగంగా పతంగుల వేడుక భలే ఉత్సాహం కలిగిస్తుంది. ఎక్కడ చూసినా చిన్నారుల చేతుల్లో గాలిపటాలు కనిపించాయి. దుకాణదారులు రంగుల రంగుల పతంగులను అమ్మకానికి సిద్ధంగా ఉంచడంతో పిల్లలు వాటిని కొనుగోలు చేసి ఎగురవేశారు. 'నింగికెగసే గాలిపటం నీదా.. నాదా.. సై..' అంటూ పోటాపోటీగా గాలిపటం దారం వదిలారు. కొన్ని దారం తెగిన గాలిపటాలు కూడా కనిపించాయి.

- జిల్లా ఫొటోగ్రాఫర్, కడప









పల్లెల్లో సంక్రాంతి వేడుకలు

కమలాపురం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పల్లెల్లో సంక్రాంతి సందడి మొదలైంది. ఈ సంబరాలు సోమవారం నుంచి మూడురోజుల పాటు అత్యంత వైభవంగా జరగనున్నాయి. సోమవారం భోగి, మంగళవారం సంక్రాంతి, బుధవారం కనుమ పండుగను చేసుకోనున్నారు. పిల్లలు, పెద్దలు, వృద్ధులు ఆయా వేడుకల్లో పాలుపంచుకుంటున్నారు. పండుగ చేసుకునేందుకు రెండు రోజులుగా పట్టణం నుంచి పిల్లపాపలతో పల్లెలకు చేరుకుంటున్నారు. వారి కోసం ఇక్కడున్న వారు పిండి వంటలు తయారు చేస్తున్నారు. ఇళ్లముందు కళ్లాపు చల్లి గొబ్బెమ్మలు, బసవన్నలతో పల్లెలు, పట్టణాలు ప్రత్యేక శోభను సంతరించుకున్నాయి. మొదటిరోజు భోగిపండుగ సందర్భంగా ప్రతి ఇంటి ముందు భోగి మంటలు వేశారు. భోగి పండ్లతో చిన్నారులకు స్నానం చేయించారు. పిల్లలు కూడా ఎంతో ఉత్సాహంగా సంబరంగా భోగివేడుకల్లో పాల్గొన్నారు.



భోగి మంట వద్ద జనం



మున్సిపల్ కార్మికుల భోగి సంబరాలు

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని పాత మున్సిపల్ కార్యాలయంలో సోమవారం మున్సిపల్ కార్మికుల ఆధ్వర్యంలో భోగిమంటల సంబరాలు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా ఎంహెచ్ఓ డాక్టర్ చంద్రశేఖర్ భోగిమంటలు ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ భోగి, సంక్రాంతి, కనుమ శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షుడు తిరుపాల్, నగర కమిటీ అధ్యక్షుడు, సుంకర కిరణ్‌దాసు, పెంచలయ్య, వడ్లపల్లి శ్రీధర్‌బాబు, ఇత్తడి ప్రకాష్, ఆసిబాబు, ధరణి, ఉమా నాగరాజు, శ్రీరాము, ఓబులేసు పెద్దఎత్తున కార్మికులు పాల్గొన్నారు.



కడప: శిల్పారామంలో భోగి పండుగ సందడి



పులివెందుల శిల్పారామంలో...

ఘనంగా భోగి పండుగ



భోగిమంటలను ప్రారంభిస్తున్న వికాస్ హరికృష్ణ

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): నగరంలోని అక్కాయిపల్లె వికాస్ హైస్కూల్ కరస్పాండెంట్, టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి వికాస్ హరికృష్ణ ఆధ్వర్యంలో భోగి మంటలను ఘనంగా ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్రాంతి సమయంలో సూర్యుడు దక్షిణాయనం నుంచి ఉత్తరాయనంలోకి ప్రవేశిస్తాడని చెప్పారు. ఈ సమయంలో ఉష్ణోగ్రతలు తగ్గి చలి ఎక్కువ అవుతుందన్నారు. ఈ చలిని తట్టుకునేందుకు భోగి మంటలు వేయడం మొదలైందని పూర్వీకులు చెప్పుకొంటారని తెలిపారు. ఆధ్యాత్మిక విషయానికొస్తే దక్షిణాయనంలో పడిన కష్టాలను తొలగించి సంతోషాలను ప్రసాదించాలని భోగిమంటలు వేస్తారని చెబుతారన్నారు. ఈ భోగి పండుగ అందరి జీవితాల్లో వెలుగులు నింపి భోగభాగ్యాలు కలగాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో వికాస్ హరికృష్ణ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

రేపు పార్వేట ఉత్సవం

కమలాపురం రూరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : సంక్రాంతి పండుగను పురస్కరించుకుని కమలాపురం నగర పంచాయతీలో పాగేరు వంక సమీపాన బుధవారం పార్వేట ఉత్సవాలను ఘనంగా నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు నీలం నరేంద్ర పేర్కొన్నారు. బండలాగుడు పోటీలు, కబడ్డీ, ముగ్గుల పోటీ, లెమన్, స్పూన్, రన్నింగ్ రేస్ తదితర కార్యక్రమాలను నిర్వహిస్తున్నట్లు తెలిపారు.

ఆత్మీయతకు ప్రతీక సంక్రాంతి

కడప కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): తెలుగు ప్రజల ఆత్మీయతకు ప్రతీక సంక్రాంతి అని టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి ఆమూరి బాలదాసు అన్నారు. భోగి పర్వదినం సందర్భంగా సోమవారం స్వర్గీయ నందమూరి తారకరామారావు విగ్రహానికి క్షీరాభిషేకం చేసిన అనంతరం కేక్‌కట్ చేసి సంబరాలు జరుపుకున్నారు.

PUBLIC NOTICE

Under the instructions of my client M/s Shriram finance ltd Vempalli branch issues the following notice to the general public. My client intend to grant loan to **Sri Yeddula Gangamma w/o Anjaneyulu** residing at D.no.1/2, Thallapalle village and post vempalli mandal ysr Kadapa district under by mortgage. As such if anyone has any claims ,objections charges or mortgages sale agreements , court attachments court disputes etc, shall be informed to the address mentioned below in within 5 days from the date of this notice ,other wise matter objections will not bind on my client not bind on my client in the regard. **SCHEDULE OF THE PROPERTIES :** YSR dist kadapa Registration dist, Vempalli sub district, Thallaplle Grama Panchayath and Village Field House d.no.1/2 Situated At Sy No : 118/1 Thallaplle Village Field & Panchayath, At Vempalli Mandal of YSR Dist An Extent of 1.01 Cents or 186.66 Sq Yards out of it 93.33 sq yards with in the following **Boundaries :** EAST : House of Bodisani Gangaiah, WEST :Open site of Yeddula latha, NORTH :Pulivendula to Kadapa main road, SOUTH : Open site of Kotturu Hussain.

A. PRATHAP REDDY
ADVOCATE, PULIVENDULA

PUBLIC NOTICE

Under the instructions of my client M/s. Shriram Finance Ltd., Kadapa Branch - 1 issues the following notice to the general public. My client intend to grant loan to **Smt. Obili Nauziya Parveen, W/o Mirza Sameer Baig, D/o, Chinna Peeranna,** D.No. 7/545, Upstairs, Mochapet Street, Kadapa City and District Kadapa City and Y.S.R. Dt. by mortgaging the below schedule mentioned property as security by way of Registered mortgaged. And as such if anyone has any claims, objections, charges or mortgages. Sale Agreements, Court Attachments, Court Disputes etc., shall be informed to the address mentioned below in writing within 5 days from the date of this notice. Otherwise matter objections will not bind on my client in this regard. **SCHEDULE OF THE PROPERTY :** Item No.1 : Sy.No. 346/B , Extent Area (in acres / hec. Sq.Yds/Sq.ft) : 90 Sq yards, Location (Address): Residential Building situating Kadapa Dt., Kadapa Urban Sub Dt., Kadapa Municipal Corporation Area, Kadapa Town, Simhadri Panthula Street, Old D.No. 7/161/A, Present D.No. 7/545, 7/545, 7/546-1 (Assessment No. 1013009244) and D.No. 7/545-1 (Assessment No. 1013009004), RCC Slab House and Vacant Site. This property is as per the Endorsement given by the Kadapa Municipal Corporation Assistant City Planner, ROC No. 3/1013078/WPRS/2022, dated 19-10-2022, Gudur Village fields in Sy.No. 346/B.. **BOUNDARIES** : EAST : Municipal Road, WEST: Parveen Baba's House, NORTH: Anwar's House , SOUTH: Sandhu Rastha and Ghouse Mohiddin House

Yours faithfully

SHIAK KHAJA MOHIDDIN
M.A. M.Phil. BL., Advocate & Notary, Kadapa.

IN THE COURT OF THE HONBLE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT KADAPA.

O.S. No.68/2024

SHAIK Gayaz Basha, Son of Late Shaik Mahaboob Saheb, aged about 44 years, Muslim, Real estate business, residing at D.No.14/27, Peddabestha Street, Kadapa City, YSR Kadapa District. **...Plaintiff**

Verses

Agaamir Yezas Ali, Son of A.Allabakash, aged about 38 years, Muslim, residing at D.No9/635, Agadi Street, Kaddapa City, YSR Kadapa District.

..... Defendant

SUMMON TO THE DEFENDANT

Whereas the above plaintiff has filed the above suit against you for specific performance of Agreement of Sale dated 21.10.2022 which was executed by you in favour of the plaintiff and the said case posted on 20.01.2025 at 10:00 am for your appearance. Therefore as per the orders of the Hon'ble Court, you appear before the above said Hon'ble Court either personally or through your advocate. If you fail to attend before the Hon'ble Court, ex-partee orders will be pass against you for your absence.

BY THE ORDERS OF THE HON'BLE COURT

"AMANCHI N.V. RAYUDU" B.Sc., LLB.
Advocate for the Plaintiff,
Kadapa Town, Cell No. 97045 63064

IN THE COURT OF THE HONBLE ADDITIONAL SENIOR CIVIL JUDGE AT KADAPA.

I.A.No.433/2024
O.S. No.68/2024

SHAIK Gayaz Basha, Son of Late Shaik Mahaboob Saheb, aged about 44 years, Muslim, Real estate business, residing at D.No.14/27, Peddabestha Street, Kadapa City, YSR Kadapa District. **.Petitioner / Plaintiff**

Verses

Agaamir Yezas Ali, Son of A.Allabakash, aged about 38 years, Muslim, residing at D.No.9/635, Agadi Street, Kadapa City, YSR Kadapa District. **... Respondent / Defendant**

NOTICE TO THE RESPONDENT / DEFENDANT

Whereas the above Petitioner / Plaintiff has filed the above petition for grant of permanent injunction restraining you and your men, agents and associates from alienating the below schedule mentioned property in favour of the 3rd parties and the said case posted on 20.01.2025 at 10:00 am for your appearance. Therefore as per the orders of the Hon'ble Court You appear before the above said Hon'ble Court either personally or through your advocate. If you fail to attend before the Hon'ble Court, ex-partee order will be pass against you for your absence.

SCHEDULE

Kadapa District, Kadapa urban Sub District, Kadapa Municipality Corporation area, Kadapa Town 9th ward Saipeta Street, newly constructed RCC Middhe House, Door No. not allotted at the time of agreement of sale, vacant site etc., in Guduru Village fields. Thereafter the Kadapa Municipal Corporation allotted D.No.9/635. 1) Sarkar Kushki D.No.398 an extent of Ac 0.60 cents out of Ac 1.00 cents. 2) Sarkar Kushki D.No.399 an extent of Ac 4.58 cents and sub divided as D.No.399/1 pyki Ac 2.22 cents. In total an extent of Ac 2.82 cents pyki Plot No.59 an extent of Ac 0.02 cents 296 square links or 0.009 hectors site and in its site having newly constructed RCC Middhe house, vacant site measuring. East : Plot No.74 site, West : 30 links width road, North : R.Subba Reddy Plot No.60 site, South : Plot No.58 site. Measuring East to West on Northern side 50 feet or 15.25 meters, East to West on southern side 50 feet or 15.25 meters, North to South on Eastern side 20 feet or 6.10 meters, North to South on Western side 20 feet or 6.10 meters, an extent of Ac 0.02 cents 296 square links or 111.14 square yards and in its site having East to West 49 feet or 14.94 meters, North to South 18 feet or 5.49 meters, 882 square feet RCC Middhe House with all easementary rights like vacant site, doors, window all electrical fittings HSC No. 4368 current meter, meter deposit etc., with all easementary rights including rastha rights on western side road.

BY THE ORDERS OF THE HON'BLE COURT

"AMANCHI N.V. RAYUDU" B.Sc., LLB.
Advocate for the Petitioner,
Kadapa Town Cell No.9704563064

వైసీపీ కడప సౌత్‌జోన్ మండల అధ్యక్షుడిగా రామ్మోహన్‌రెడ్డి

కడప ఎర్రముక్కపల్లె, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ కడప మండల సౌత్‌జోన్ అధ్యక్షుడిగా రామ్మోహన్‌రెడ్డిని నియమించారు. ఈ నేపథ్యంలో మేయర్ సురేష్‌బాబుని కలిసి సన్మానం చేశారు. ఈ సందర్భంగా సురేష్‌బాబు అందరిని కలుపుకొని పార్టీని బలోపేతానికి కృషిచేయాలన్నారు. ఈ కార్యక్రమంలో కార్పొరేటర్ షఫీ, నాయకులు జిల్లా ఉపాధ్యక్షులు దాసరి శివప్రసాద్, రఘు, జగదీష్ రెడ్డి, గంగరాజు, ఎల్లారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పాడిపంటలతో దేశం సుభిక్షంగా ఉండాలి



కడప కల్చరల్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పాడిపంటలతో దేశం సుభిక్షంగా ఉండాలనే సంకల్పంతో నగర గడ్డిబజార్‌లో వెలసిన సోమసుందరేశ్వరస్వామి (బాలాజీగుడి) దేవాలయంలో ఆర్ద్ర నక్షత్రం సందర్భాన్ని పురస్కరించుకుని సోమవారం మహన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, అన్నాభిషేకం కార్యక్రమాన్ని అత్యంత భక్తిశ్రద్ధలతో నిర్వహించినట్టు ఆ ఆలయ ప్రధాన అర్చకుడు బ్రాహ్మణపల్లి చంద్రమౌళిశర్మ వెల్లడించారు. అనంతరం స్వామివారికి విశేష అలంకరణ, మహామంగళహారతి, మంత్రపుష్పం, తీర్థప్రసాద వినియోగం గావించారు.

'ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల పక్షపాతి'

కడప కలెక్టరేట్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి చంద్రబాబు ఉద్యోగుల పక్షపాతిఅని ఏపీ ఎన్జీవో సంఘం ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు బి.శ్రీనివాసులు, కార్యదర్శి రవికుమార్, రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రసాద్ యాదవ్ తెలిపారు. సోమవారం నగరంలోని ఏపీ ఎన్జీవో జిల్లా కార్యాలయంలో వారు విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఈనెల 1వ తేదీన ఏపీ ఎన్జీవో సంఘ రాష్ట్ర అధ్యక్షుడు కేవీ శివారెడ్డి, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి విద్యాసాగర్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడిని కలిసి ఉద్యోగుల పెండింగ్ బకాయిలపై చర్చించారన్నారు. సమస్యను పరిష్కరిస్తాన ని సీఎం హామీ ఇచ్చారన్నారు. రూ.13 వేల కోట్ల పెండింగ్ బకాయిలు ప్రకటించి ఉద్యోగుల పక్షపాతిగా నిలిచారన్నారు.

ఘనంగా మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్యకు నివాళి

రాజంపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య జయంతి సందర్భంగా ఆయన కుమారుడు పసుపులేటి ప్రవీణ్‌కుమార్ ఆధ్వర్యంలో పలువురు నాయకులు బ్రహ్మయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ప్రభుత్వ వైద్యశాలలో రోగులకు పండ్లు, పాలు పంపిణీ చేశారు. ఈ సందర్భంగా బీజేపీ జిల్లా అధ్యక్షుడు సాయిలోకేష్, రాజంపేట మండల పరిషత్ మాజీ అధ్యక్షుడు డాక్టర్ పారా సుబ్బానాయుడు, టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి డాక్టర్ చెన్నూరు సుధాకర్, గీతాంజలి విద్యాసంస్థల అధినేత ఎస్వీ రమణ, మార్కెట్ యార్డు మాజీ చైర్మన్ ఎద్దల విజయసాగర్ తదితరులు మాట్లాడుతూ మాజీ మంత్రి పసుపులేటి బ్రహ్మయ్య రెండు సార్లు ఎమ్మెల్యేగా, మంత్రిగా రాజంపేటను అన్నిరంగాల్లో అభివృద్ధి చేశారన్నారు. కోట్లాది రూపాయలు ఖర్చు చేసి పలు సేవా కార్యక్రమాలను నిర్వహించారన్నారు. పసుపులేటి ఫౌండేషన్ ట్రస్టు ద్వారా తమ సొంత గ్రామం పొత్తపిలో శ్రీమతి సరస్వతి పేరిట ఉన్నత పాఠశాలను నెలకొల్పారన్నారు. నేడు జిల్లాలో ప్రముఖ పుణ్యక్షేత్రంగా వెలుగొందుతున్న భువనగిరి పల్లె లక్ష్మీ నరసింహస్వామి ఆలయాన్ని అన్నివిధాల అభివృద్ధి చేశారన్నారు. ఈ కార్యక్రమంలో గుగ్గిళ్ల చంద్రమౌళి, రవి. డాక్టర్ తోట రామయ్య, బండారు బాలయ్య, ఇడిమడకల కుమార్, మలిశెట్టి సుబ్బరాయుడు, ఎంఎల్ నారాయణ, మనుబోలు వెంకటేశ్వర్లు, పబ్బిశెట్టి సుబ్రమణ్యం, సునీల్ పాల్గొన్నారు.



బాలింతలకు పండ్లు పంపిణీ చేస్తున్న సాయిలోకేష్, పసుపులేటి పవన్‌కుమార్

బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ సభకు తరలి రండి

జమ్మలమడుగు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): జమ్మలమడుగులోని నాగులకట్టవీధి శ్రీ చౌడేశ్వరీదేవి కల్యాణ మండపంలో ఈనెల 19వ తేదీ ఆదివారం ఉదయం 9.30 గంటలకు ప్రారంభమయ్యే బీసీ సంక్షేమ సంఘం ఆవిర్భావ సభకు బీసీలంతా తరలి రావాలని ఆ సంఘం నాయకుడు రాష్ట్ర ప్రధాన కార్యదర్శి బడిగించల చంద్రమౌళి, నియోజకవర్గ అధ్యక్షుడు చౌడం జొల్లు కొండయ్య, వర్కింగ్ ప్రెసిడెంట్ కాటా రామదాసు పిలుపునిచ్చారు. సోమవారం జమ్మలమడుగు మండలంలోని మోరగుడి గ్రామంలో వారు ఇంటింటికి వెళ్లి బీసీ కులాల ఆత్మీయ సమ్మేళన సభకు తరలి రావాలని ప్రచారం నిర్వహించి కరపత్రాలు అందజేశారు. ఈ కార్యక్రమంలో బీసీ సంక్షేమ సంఘం నాయకులు గూడెం చెరువు సురేష్, వాల్మీకి సంఘం అధ్యక్షుడు పెద్దకంబయ్య, మహిళలు, చేనేత కార్మికులు పాల్గొన్నారు.

ఘనంగా కోలాటం, గజ్జపూజోత్సవం

ఖాజీపేట, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని నాగపట్నంలో కోలాటం, గజ్జపూజోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. సోమవారం 40 రోజులు పూర్తిగా నాగపట్నం గ్రామానికి చెందిన మహిళలు, చిన్నారులు కోలాటం నేర్చుకుని సోమవారం ఘనంగా నిర్వహించి రాత్రికి అన్నదానం భారీగా చేశారు.

రైతుల పక్షపాతి కూటమి ప్రభుత్వం



కాశినాయన జనవరి13 (ఆంధ్రజ్యోతి): రైతుల పక్షపాతిగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని బద్వేల్ టీడీపీ యువనాయకుడు కే.రితీష్ రెడ్డి పేర్కొన్నారు.సోమవారం మండలంలోని కోడిగుడ్లపాడు, సావి శెట్టిపల్లె గ్రామాల్లో నిర్మించి గోకులాలను ఆయన ప్రారంభి ంచారు.కార్యక్రమంలో భాగంగా గంటువారిపల్లెలో సిమెంట్ రోడ్డును కూడా ప్రారంభించారు. ఈకార్యక్రమంలో కడప టీడీపీ ఉపాధ్యక్షుడు బంగారు గుర్విరెడ్డి, బసిరెడ్డి రవీందారెడ్డి, నర్సిరెడ్డి, శ్రీనివాసులరెడ్డి, బి.వెంకటరెడ్డి, రామసుబ్బారెడ్డి, పోలిరెడ్డి,దుగ్గిరెడ్డి,క్రిష్టారెడ్డి కార్యకర్తలు పాల్గొన్నారు.

ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు



మైదుకూరు రూరల్,జనవరి 13(ఆంధ్రజ్యోతి) : మైదుకూరు నియోజకవర్గ ప్రజలకు ఎమ్మెల్యే పుట్ట సుధాకర్‌యాదవ్ సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. నియోజకవర్గంలోని ప్రజలు పాడి పంటలతో, ఆయురా రోగ్యాలతో సుఖంగా ఉండాలని తెలిపారు.

సంక్రాంతికి ఘన స్వాగతం

బద్వేలు, జనవరి 13, (ఆంధ్రజ్యోతి): సంక్రాంతి సంబరాలతో పల్లెసీమలు కళకళలాడుతున్నాయి. విద్య, ఉద్యోగం, ఉపాధి నిమిత్తం, నగర, పట్టణాల్లో ఉన్నవారు సొంత ఊర్లకు వచ్చారు. చిన్ననాటి స్నేహితులు, బంధువులు, కుటుంసభ్యులతో కలసి ఆటపాటలతో ఆనందంగా గడుపుతున్నారు. సంస్కృతిని చాటే యువత సాంప్రదాయ దుస్తుల ను ధరించి గ్రామాల్లో సందడి చేస్తున్నారు. ప్రతి ఇంటి ముందు రంగురంగుల రంగవల్లులు వేశారు. రేగి పండ్లను తలపైపోసి చిన్నారులను పెద్దలంతా ఆశీర్వదిం చారు. బద్వేలునియోజకవర్గ ప్రజలు సోమవారం ముత్యాల ముగ్గులతో భోగికి ఘనంగా ఆహ్వానం పలికారు. ప్రజలంతా రంగవల్లులు, బోగిమంటలతో సంక్రాంతి లక్ష్మీకి ఘనస్వాగతం పలికారు.

ప్రొద్దుటూరు రూరల్..: సంక్రాంతి పర్వదినం సందర్భంగా గ్రామీణ ప్రాంతాల్లో పాడిపంటలతో రైతులు వర్ధిల్లాలని ఎమ్మెల్యే నంద్యాల వరదరాజులరెడ్డి తెలిపారు. సోమవారం ఉదయం ఆయన స్వగ్రామం రాధానగర్‌లో భోగి మంటలను వెలిగించి సంక్రాంతి సంబరాలను ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే సోదరుడు, మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి, నంద్యాల కొండారెడ్డి, కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కాగా మండల పరిధిలోని కామనూరు గ్రామంలో సంక్రాంతి సంబరాలు అంబరాన్ని అంటాయి. గ్రామంలో ఆటల పోటీలను మాజీ ఎంపీపీ రాఘవరెడ్డి కుమారుడు నంద్యాల గోవర్ధన్‌రెడ్డి, నంద్యాల ముకుందర్‌రెడ్డి ప్రారంభించారు. విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. జూనియర్ కబడ్డీ, ట్రాక్టర్ రివర్స్ పందెం, స్లోబైక్ రైడ్ విజేతలకు బహుమతులు ప్రదానం చేశారు.



ప్రొద్దుటూరు... భోగి మంట వేస్తున్న ఎమ్మెల్యే వరదరాజులరెడ్డి



బద్వేలులో...

ఒకరికి రిమాండ్

చాపాడు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మొరాయిపల్లెకు చెందిన కోవర్ల ప్రసన్నకుమార్ అనే వ్యక్తిని సోమవారం అరెస్టు చేసి మైదుకూరు కోర్టులో హాజరుపరచగా కోర్టువారు అతనికి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు. ఈనెల 6వ తేదీన అదే గ్రామానికి చెందిన చంద్రాయుడు అనేవ్యక్తి ఇంటిలో ప్రసన్నకుమార్ సుమారు రూ.2 లక్షలు విలువచేసే బంగారు నగలను చోరీ చేసినట్లు తెలిపారు. ప్రసన్నకుమార్ వద్ద నుంచి బంగారు నగలను స్వాధీనం చేసుకున్నట్లు వారు తెలిపారు.

తప్పిన ప్రమాదం

అట్లూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): అట్లూరు మండలంలోని కమలకూరు సమీపంలో సోమవారం తారురోడ్డుపై 11 కేవీ విద్యుత్ వైర్లు తెగిపడడంతో ఆటోలో వెళుతున్న ప్రయాణికులు, ద్విచక్ర వాహనదారులకు ప్రమాదం తప్పింది. వెంటనే ట్రాన్స్‌కో అధికారులకు ఫోను ద్వారా తెలపడంతో అధికారులు వచ్చి విద్యుత్ లైన్‌ను పునరుద్ధరించారు.

కళలను ప్రోత్సహించాలి

ప్రొద్దుటూరు టౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): భారతీయ కళలను ప్రోత్సహించాలని బీజేపీ జిల్లా అధ్యక్షుడు వంగల శశిభూషణ్‌రెడ్డి పేర్కొన్నారు. శ్రీకృష్ణ గీతాశ్రమంలో నటరాజ కళాక్షేత్రం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాయలసీమ సంగీత నృత్యోత్సవం ముగింపు కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ రాష్ట్ర సాంస్కృతిక శాఖ కన్వీనర్ భానుప్రకాష్ ,సాంస్కృతిక కార్యక్రమాల ద్వారా శారీరక, మానసిక వికాసంతోపాటు ఉల్లాసం, ఉత్సాహం కలుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ప్రధాన కార్యదర్శి కృష్ణప్రదీప్‌రెడ్డి, ఎస్వీ డిగ్రీ కళాశాల కరస్పాండెంట్ హరినారాయణ, డాక్టర్ ఖాజా వెంకటసుబ్రమణ్యం, డాక్టర్ వేదాంతం రామలింగశాస్త్రి పాల్గొన్నారు.

టీడీపీ శాశ్వత సభ్యత్వం నమోదు

బద్వేలుటౌన్, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : పట్టణంలోని టీడీపీ కార్యాలయం ఆవరణలో సోమవారం బద్వేలు నియోజకవర్గ టీడీపీ సమన్వయకర్త రితేష్‌కుమార్‌రెడ్డి చేతులమీదుగా ఆ పార్టీకి లక్షరూపాయలు చెల్లించి మన్యం సుధాకర్‌రెడ్డి శాశ్విత సభ్యత్వ నమోదు తీసుకున్నారు.ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

వ్యక్తి ఆత్మహత్య

ప్రొద్దుటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ప్రొద్దుటూరు పట్టణంలోని సారవకట్టవీధికి చెందిన శివశంకర్ (36) ఆదివారం అర్ధరాత్రి ఇంట్లో ఫ్యానుకు ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఇతనికి భార్య ఇద్దరు పిల్లలు ఉన్నారు. కాగా మృతుడు దుస్తుల వ్యాపారం చేసేవాడు. మద్యానికి బానిసయ్యాడు. దీంతో భార్యాభర్తల మధ్య మనస్పర్థలు ఉండటంతో ఇంట్లో ఎవరూ సమయంలో ఆత్మహత్య చేసుకున్నాడు. చనిపోయే ముందు మృతుడు తల్లి చెన్నమ్మకు ఫోన్ చేశాడు. ఆమె వేరే వీధిలో ఉండటంతో ఆమె వచ్చి చూసేసరికి అతను ఉరి వేసుకుని ఉన్నాడు. ఆసుపత్రికి తీసుకెళ్లగా అప్పటికే మృతి చెందినట్లు వైద్యులు తెలిపారు. ఆమె ఫిర్యాదు మేరకు వన్‌టౌన్ పోలీసులు కేసు నమోదు చేశారు. కుమారుడి మృతిపై అనుమానాలు ఉన్నట్లు తల్లి చెన్నమ్మ పేర్కొంది.

రోడ్డు ప్రమాదంలో తీవ్ర గాయాలు

గోపవరం, జనవరి 13 (ఆంధ్రజ్యోతి) : బద్వేలు-నెల్లూరు ప్రధాన రహదారిపై మండలంలో ఉన్న 1వ కాలనీ వద్ద సోమవారం తెల్లవారుజామున రోడ్డు ప్రమాదం జరిగింది. ఈ సంఘటనలో వ్యక్తికి తీవ్ర గాయాలయ్యాయి. ప్రాజెక్టు కాలనీకి చెందిన నల్లిపోగు చెన్నయ్య అనే వ్యక్తి నడుచుకుంటూ రోడ్డు దాటుతున్నాడు. కాగా బద్వేలు నుంచి ద్విచక్ర వాహనంలో నెల్లూరు జిల్లా సింగనపల్లెకు వెళుతున్న వెంకటేశ్ అనే వ్యక్తి చెన్నయ్యను ఢీకొనడంతో ఆయనకూ తీవ్ర గాయాలయ్యాయి. వెంటనే స్థానికులు 108లో చికిత్స నిమిత్తం ప్రభుత్వ ఆసుపత్రికి వైద్యం కోసం తరలించారు.